క్లుప్తంగా

జాషువా సంస్మరణ పుస్తకావిష్కరణ రేపు

తిరుపతి కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ గుర్రం జాషువా సంస్మరణ పుస్తకావిష్కరణ సభ నిర్వహిస్తున్నట్లు అరసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న ఓ ప్రకటనలో తెలిపారు. 128వ జయంతి సందర్భంగా చేపడుతున్న ఈ కార్యక్రమం గురువారం ఉదయం 10.30 గంటలకు బైరాగిపట్టెడలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి కవులు, రచయితలు, సాహితీ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పెళ్లికానుకను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాకాల : మండలంలోని సామిరెడ్డిపల్లి పంచాయతీ హసన్‌పురం గ్రామంలో త్వరలో పెళ్లి చేసుకోనున్న వధూవరులకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లికానుకను అందజేశారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల చేతుల మీదుగా కాబోయే దంపతులు ఖలీల్, రెడ్డి పర్వీన్‌లకు నల్లపూసల దండ, వెండి మెట్టెలు, దుస్తులు, గ్రీటింగ్ కార్డును అందజేశారు. నాయకులు గోపి, హరీష్‌కుమార్ రెడ్డి, ఆలంసాహెబ్ పాల్గొన్నారు.

జడ్జి బాధ్యతల స్వీకరణ

తిరుపతి లీగల్: తిరుపతి పదవ అదనపు జిల్లా జడ్జిగా టి.రామచంద్రుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇదివరకు విజయవాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహించారు. రాష్ట్ర హైకోర్టు ఆయనకు అదనపు జిల్లా జడ్జిగా పదోన్నతి ఇస్తూ తిరుపతికి బదిలీ చేసింది. ఆయన గతంలో తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహించిన విషయం తెలిసిందే.

జాబ్‌మేళాకు స్పందన

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. మొత్తం నాలుగు కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. జాబ్‌మేళాకు 76 మంది నిరుద్యోగులు హాజరు కాగా 16మందిని ఎంపిక చేసుకున్నట్లు విభాగ డిప్యూటీ చీఫ్ పి. శ్రీనివాసులు తెలిపారు.

సచివాలయంలో మెడికల్ క్యాంప్

పాకాల : మండల కేంద్రంలోని సచివాలయం -1లో స్థానిక సర్పంచ్ ఎస్.కస్తూరి ఆధ్వర్యంలో సుభోదయ ఆస్పత్రి, జేపీ ఐ కేర్ వారి సౌజన్యంతో మంగళవారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యులు సుమారు 200 మందికి పైగా బీపీ, షుగర్, నరాలు, ఎముకలు, కంటికి సంబంధించిన వైద్యపరీక్షలు చేశారు. అలాగే వారికి ఉచితంగా మందులను సరఫరా చేశారు. ఈఓ మోతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి లీగల్: ఆసరా న్యాయవాదుల అసోసియేషన్ సామాజిక బాధ్యత, అవగాహన సంస్థ (వినియోగదారుల హక్కులు రక్షణ కౌన్సిల్) ఆధ్వర్యంలో నవంబర్ 18న జరగనున్న 5వ జాతీయ సమ్మేళనం పోస్టర్లను తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు పార్థసారథి మంగళవారం ఆవిష్కరించారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కలిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే సంస్థలను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. కమిషన్ సభ్యుడు ఎన్.శశిధర్‌రెడ్డి, ఆసరా సంస్థ తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎ.మునిశేఖర్ పాల్గొన్నారు.

గణితంపై భయాన్ని తొలగించండి

పాకాల : చిన్నతనం నుంచే విద్యార్థులకు గణితంపై ఉన్న భయాన్ని తొలగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈఓ బాబ్జి తెలిపారు. మంగళవారం దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో పాకాల, రామచంద్రాపురం, చంద్రగిరి మండలాలకు చెందిన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సహజంగా గణితం అంటే తెలియని భయాన్ని కలిగి ఉంటారని, అర్థం చేసుకోగలిగితే అన్ని సబ్జెక్టులకన్నా గణితం చాలా సులభంగా ఉంటుందన్నారు. ఎంఈఓ-2 లింగయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఏదో ఒక లక్ష్యం ఉంటుందని, లక్ష్యాన్ని ఎదుర్కొనే క్రమంలో అనేక ఆటంకాలు ఎదురవుతాయని, అన్నింటినీ ఎదుర్కొని లక్ష్యాన్ని సాధించినప్పుడు ఆత్మసంతృప్తి కలుగుతుందని తెలిపారు. సీఆర్‌సీ హెచ్‌ఎం నాగరాజ, సంయుక్త కార్యదర్శులు విజయమోహన్, రెడ్డెప్ప, వెంకటస్వామి, సీఆర్పీలు శ్రీనివాసులు, మునికృష్ణ పాల్గొన్నారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌కు వీల్‌చైర్స్ వితరణ

తిరుపతి అర్బన్: తెలంగాణ రాష్ట్రం భువనగిరికి చెందిన వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ చైర్మన్ రామకృష్ణ, సభ్యుడు మురళీకృష్ణ 8 వీల్ చైర్స్‌ను మంగళవారం తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణకు అందజేశారు. ఆయనతో పాటు తిరుపతి సీసీఐ శ్రీకాంత్ ఉన్నారు.

శ్రీనివాసుని బ్రహ్మోత్సవం
విజయవంతం



స్నపన తిరుమంజనంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి



చక్రత్తాళ్వార్‌కు అవభృథ స్నానం చేస్తున్న వేదపండితులు

తిరుమల: శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో విజయవంతంగా ముగిశాయి. ఉదయం చక్రస్నానంలో శ్రీవారు సేద తీరారు. రాత్రి ధ్వజావరోహణంతో ఉత్సవాలకు ముగింపు పలికారు. తొమ్మిది రోజులపాటు వాహన సేవలు వేడుకగా జరిగాయి. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, జేఈఓలు వీరబ్రహ్మం, సదా భార్గవి, జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి సమన్వయంతో పనిచేశారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సెప్టెంబరు 18 నుంచి 25వ తేదీ వరకు 8 రోజుల పాటు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి.

- సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సెప్టెంబర్ 18వ తేదీన శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.
- వడమాలపేట మండలం పాదిరేడు సమీపంలో 3,518 మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల పట్టాల పంపిణీని ప్రారంభించారు.
- తిరుమలలో దాతల సహకారంతో రూ.20 కోట్లతో నిర్మించిన వకుళామాత నిలయం విశ్రాంతి గృహాన్ని, రూ.11.50 కోట్లతో నిర్మించిన శ్రీ రచన విశ్రాంతి గృహాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు.
- శ్రీవారిని బ్రహ్మోత్సవాల్లో 5.47 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.
- గరుడసేవ రోజు 72,650 మంది దర్శించుకున్నారు. కాగా, గరుడసేవలో దాదాపు 2 లక్షల మంది భక్తులు పాల్గొన్నారు.
- రోజుకు 8 లక్షల లడ్డూలు బఫర్ స్టాక్ పెట్టారు.
- విక్రయించిన మొత్తం లడ్డూలు 30.22 లక్షలు.
- హుండీ కానుకలు రూ.24.22 కోట్లు.
- 2,770సీసీ టీవీలు, 5వేల మంది టీటీడీ విజిలెన్స్, పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.
- చిన్నపిల్లలు తప్పిపోకుండా 6 వేల చైల్డ్ ట్యాగ్‌లు కట్టారు.
- తలనీలాలు సమర్పించుకున్న భక్తుల సంఖ్య 2.07 లక్షలు.
- 1150 మంది క్షురకులు 11 కల్యాణకట్టల్లో భక్తులకు తలనీలాలు తీశారు.
- గదుల కేటాయింపు ద్వారా వచ్చిన ఆదాయం రూ.1.69 కోట్లు.
- బ్రహ్మోత్సవాల్లో గదుల ఆక్యుపెన్సీ 80 శాతం.
- బ్రహ్మోత్సవాల్లో 16.28 లక్షల భోజనాలు, అల్పాహారం అందించారు.
- గరుడసేవనాడు 4.81 లక్షల మందికి అన్నప్రసాదాలు, అల్పాహారం, 3.37 లక్షల మందికి టీ, కాఫీ, పాలు, 2.50 లక్షల మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు అందించారు.
- హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఒడిశా, మహారాష్ట్ర, ఝార్ఖండ్, గుజరాత్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, రాజస్థాన్ కలిపి 12 రాష్ట్రాల నుంచి వచ్చిన 152 కళాబృందాల్లో 3,710 మంది కళాకారులు 52 కళారూపాలను ప్రదర్శించారు.
- శ్రీవారి ఆలయంతో పాటు పలు కూడళ్లు, అతిథి గృహాల వద్ద శోభాయమానంగా పుష్పాల అలంకరణలు, పుష్పప్రదర్శన. 45 టన్నులు పుష్పాలు, 3 లక్షల కట్ ఫ్లవర్స్, 75 వేల సీజనల్ ఫ్లవర్స్ వినియోగించారు.
- 3,342 మంది శ్రీవారి సేవకులతో భక్తులకు సేవలు అందించారు.
- వాహనసేవల్లో తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, ఇంగ్లీషు, సంస్కృత భాషల్లో 10 ఆధ్యాత్మిక గ్రంథాలు ఆవిష్కరణ.
- ఏపీఎస్ఆర్టీసీ తిరుపతి నుంచి తిరుమలకు 13,352 ట్రిప్పుల్లో 3.25 లక్షల మంది భక్తులను చేరవేశాయి. తిరుమల నుంచి తిరుపతికి 12,977 ట్రిప్పుల్లో 3.69 లక్షల మంది భక్తులను చేరవేశాయి.
- గరుడసేవనాడు ఆర్టీసీ బస్సులు తిరుపతి నుంచి తిరుమలకు 2491 ట్రిప్పుల్లో 73,460 మంది భక్తులను చేరవేశాయి. తిరుమల నుంచి తిరుపతికి 2400 ట్రిప్పుల్లో 56,491 మంది భక్తులను చేరవేశాయి.



పుష్కరిణి వద్దకు ఉత్సవమూర్తుల ఊరేగింపు



చక్రస్నానంలో పాల్గొన్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి



ఎస్పీ పరమేశ్వరరెడ్డి కుటుంబం



సినీ నిర్మాత దిల్ రాజు

వ్యక్తిత్వ వికాసంతో వృత్తిపరమైన సవాళ్లు పరిష్కారం

తిరుపతి సిటీ: వ్యక్తిత్వ వికాసంతో వృత్తిపరమైన సవాళ్లకు చక్కని పరిష్కారం లభిస్తుందని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ రాణి అన్నారు. 'వ్యక్తిత్వ వికాసం, వృత్తిపరమైన సవాళ్ల పరిష్కారం' అనే అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సైకాలజిస్ట్ బి.రుక్మిణి, రాణి మాట్లాడుతూ.. ప్రతి మనిషి జీవితంలో ఆరోగ్య, ఆర్థిక, సామాజిక, మానసిక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పట్టుదల, ఆత్మస్థైర్యం ఉంటే ఎలాంటి సవాళ్లనైనా అధిగమించవచ్చని సూచించారు. విద్యార్థులకు పలు మోటివేషన్ స్టోరీస్, వీడియోస్ చూపించారు.

పవిత్రాల సమర్పణ

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం వేడుకగా పవిత్ర సమర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. తదనంతరం మూలవర్లకు, ఉత్సవర్లకు, ఉప ఆలయాలకు, పరివార దేవతలకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి, శ్రీమఠం ఆంజనేయస్వామివారికి పవిత్రాలు సమర్పించారు. పెద్ద జీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఆలయ ప్రధాన అర్చకుడు ఏపీ.శ్రీనివాసదీక్షితులు, ఏఈఓ మునిక్రిష్ణారెడ్డి, సూపరింటెండెంట్ నారాయణ పాల్గొన్నారు.



పవిత్రాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు

తిరుపతి-పనపాకం బస్సు పునరుద్ధరణ

చంద్రగిరి: తిరుపతి-పనపాకం సర్వీసు బస్సును మరో వారం రోజుల్లో పునరుద్ధరించనున్నట్లు వైఎస్సార్‌సీపీ ఐతేపల్లి డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి తెలిపారు. తిరుపతి నుంచి పనపాకం మీదుగా సుమారు 50కు పైగా గ్రామాలున్నాయని తెలిపారు. జాతీయ రహదారి విస్తరించిన తర్వాత సర్వీసు బస్సును నిలిపి వేశారన్నారు. సమస్యను చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం చెంగల్‌రెడ్డితో మాట్లాడడం జరిగిందన్నారు. ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు బస్సును నడిపేందుకు అధికారులు అంగీకరించారన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ మోహిత్ రెడ్డికి రుణపడి ఉంటామన్నారు.

జయరామనాయుడికి అభినందనలు

పాకాల : నూతనంగా జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా టి.జయరామనాయుడు ఎన్నికయ్యారు. మంగళవారం పాకాలలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జయరామనాయుడు మాట్లాడుతూ ఈ ఎన్నికలు 25వ తేదీన కాకినాడ జిల్లాలోని సూర్య కళామందిరంలో జరిగాయని, పాకాల శాఖ నుంచి తనని ఏకగ్రీవంగా ఎంపిక చేశారని తెలిపారు. తనకు పదవి అప్పగించిన సంఘం రాష్ట్ర కార్యవర్గం సభ్యులకు రుణపడి ఉంటానన్నారు. సంఘం పాకాల యూనిట్ అధ్యక్షుడు మునస్వామి, ప్రధానకార్యదర్శి కుప్పుస్వామి పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు మంగళవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శమిచ్చారు. స్వామివారి జన్మనక్షత్రమై శ్రావణం సందర్భంగా తెల్లవారుజామున స్వామివారిని మేల్కొలిపి, నిత్యకైంకర్యాలను నిర్వహించారు. వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ దేవేరులకు ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం సర్వాంగ శోభితుడైన శ్రీవారు, శ్రీదేవి, భూదేవి సమేతంగా అలంకరణ మండపానికి వేంచేశారు. బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లకు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు

విద్యార్థుల చేతుల్లో దేశ భవిష్యత్తు

చంద్రగిరి: మన దేశ భవిష్యత్ తరగతి గదుల్లో ఉండే విద్యార్థుల చేతుల్లోనే ఉందంటూ ఎంఈఓ లలిత కుమారి విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాల నా దేశం-నా మట్టి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పాఠశాల నుంచి విద్యార్థులు జాతీయ నాయకుల చిత్రపటాలు, జాతీయ జెండాను చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్రప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నా దేశం -నా మట్టిలో భాగంగా మట్టిని సేకరించి దేశ రాజధానికి పంపించడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో భారతదేశం అగ్రగామిగా మారుతుందన్నారు. దీనికి కారణం విద్యార్థులేనని, దేశ భవిష్యత్ మీ చేతిలో ఉందనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ప్రపంచ దేశాలు గర్వపడేలా మీరు ఉన్నతస్థాయికి చేరుకుని, దేశానికి సేవలందించాలన్నారు. అనంతరం జాతీయజెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకట రమణారెడ్డి, ఉపాధ్యాయరాలు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ లలితకుమారి, హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి

ముగిసిన సాంస్కృతికోత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుపతిలోని వివిధ కళా వేదికలపై 9 రోజులుగా జరుగుతున్న సంగీత, నృత్య సాంస్కృతికోత్సవం మంగళవారంతో ముగిసింది. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నగరంలోని మహతి, అన్నమాచార్య కళామందిరం, శ్రీరామచంద్రపుష్కరిణి వేదికలపై నృత్య సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. చివరి రోజు మంగళవారం మహతి కళాక్షేత్రంలో ఎస్వీ సంగీత, నృత్య కళాశాలకు చెందిన శశికళ శిష్య బృందం ప్రదర్శించిన నృత్యరూపకం, వందన బృందం ప్రదర్శించిన సంగీత కచేరి భక్తులను రంజింపజేసింది. వేంకటేశ నిన్ను..., పన్నగేంద్రశయన వంటి కీర్తనలతో ఆకట్టుకున్నారు.



నృత్యప్రదర్శన చేస్తున్న కళాకారులు